ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌ను కలసిన మేడా

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్ర సూక్ష్మ మధ్య తరహా పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఇ) కార్పోరేషన్ నూతన చైర్మన్‌గా ఆదారి ఆనంద్ కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్‌ను రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఇ) డైరెక్టర్ మేడా బద్రీనాథ్ మార్యాద పూర్వకంగా కలసి అభినందించారు. పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం డివిజన్‌లో పారిశ్రామిక రంగ అభివృద్ధికి పాటుపడాలని చైర్మన్ అనంద్ కుమార్‌ను బద్రీనాథ్ కోరారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిసిన ఉగ్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తూర్పు రాయలసీమ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం కందుకూరు పట్టణంలోని నిర్వహించిన అభినందన సభకి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని కనిగిరి టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయం కృష్ణారెడ్డి, కూడలి రోశయ్య, గంగిరెడ్డి రమేష్ రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మనోజ్ మరియు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు ఏఐటీయూసీ ఒంగోలు నగర జనరల్‌బాడీ సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు : ఏఐటీయూసీ ఒంగోలు నగర సమితి జనరల్ బాడీ సమావేశం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ ఒంగోలునగర సమితి కార్యద్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు ఈ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయని కోరారు.

'పోషక పక్వాడ'

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషక పక్వాడ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ అధికారిని సిడిపిఓ నాగమణి, సూపర్వైజర్ వసంత కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసుకునే పద్ధతిని బాలింతలకు పిల్లల తల్లులకు చూపించడం జరిగిందని సిడిపిఓ నాగమణి అన్నారు. అలానే చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తినడం వల్ల కలుగు ప్రయోజనాలను వారికి వివరించామని అలానే వెల్ బేబీ షో కూడా నిర్వహించామని అన్నారు. ఆరోగ్యంగా ఉన్న సంవత్సరంలోపు చిన్నారులను గుర్తించడం జరిగిందనిమిగతా వారి పిల్లల తల్లులకు వయసుకు తగ్గ ఎత్తు బరువు పెరిగేందుకు తగు సూచనలు సలహాలు ఇచ్చామని సిడిపిఓ నాగమణి అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సర్పంచ్ భూమా నాగమ్మ, ఎంపీటీసీ నాగమణి, అంగన్వాడి కేంద్ర సిబ్బంది బాలింతలు పాల్గొన్నారు.

సత్యకుమార్‌పై దాడి హేయం

బీజేపీ నేత పీవీ కృష్ణారావు

విశాలాంధ్ర-మార్కాపురం : అమరావతి రైతులకు మద్దతుగా వెళుతున్న సందర్భంగా బిజెపి జాతీయ కార్యదర్శి సత్య కుమార్‌తో పాటు పార్టీ నాయకులపై వైసీపీ గుండాలు విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్యని మార్కాపురం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి పివి కృష్ణారావు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయా రాజకీయ పార్టీలకు వివిధ అంశాలపై ప్రజా పోరాటాలు చేసుకునే హక్కు ఉందని, అయితే దురదృష్టవశాత్తు ఏపీలో మాత్రం జగన్ పాలనలో ఆ హక్కును ప్రజలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిలో బీజేపీ నాయకుల పై ఒక పథకం ప్రకారం వైసీపీ ఎంపీ నందిగం సురేష్ ఆధ్వర్యంలో రౌడీ మూకలు దాడి చేయడం జరిగిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో అమరావతి మాత్రమే రాజధానిగా ఉండాలని ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. బిజెపి నాయకులపై దాడి చేసిన అల్లరి ముకలపై తక్షణమే కేసు నమోదు చేసి వారిని శిక్షించాలని, లేనిచో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని పివి కృష్ణారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- 700 రోజుల ఉద్యమానికి సంఘీభావం
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నిరసన

విశాలాంధ్ర-ఒంగోలు : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పివిఆర్ చౌదరి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఆర్ చౌదరి మాట్లాడుతూ 32 మంది త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కుని కాపాడుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మ కాన్ని ఆపాలని దానికోసం పెద్ద ఎత్తున పోరాడాలని ఉద్యోగులకు, కార్మికులకి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు స్వంత గనులు కేటాయించలేని ప్రభుత్వానికి అమ్మే హక్కు ఎక్కడుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల పేరుతో ప్రయివేటు వ్యక్తులకు అమ్మటమే లక్ష్యంగా పెట్టుకుని దేశాన్ని దివాళా తీయిస్తున్నా రన్నారు. రూ.3లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేవలం రూ.5వేల కోట్లకు అమ్మటం దుర్మార్గమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం ప్రారంభించి 700 రోజులు జరుగింది. అక్కడ విశాఖపట్నం లో ప్రతిరోజు నిరాహార దీక్షలు, అనేక పోరాటాలు, ఉద్య మాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐఎఫ్ టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్ తదితరులు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లడారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఒంగోలు నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నాయకులు పోలేరయ్య, వై రమేష్, బొడ్డపాటి సుబ్బారావు, పి నరశింహారావు, నాగేశ్వరరావు, మనోహర్, రాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాంబాబు, టి మహేష్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి, ఆటో యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీని వాసులు, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ చిరంజీవి,శ్రీరామ శ్రీనివ సరావు ,నాయకులు పోలేరయ్య, సిఐటియు నాయకులు జి.రమేష్ పాల్గొని జయప్రదం చేశారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-ముండ్లమూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 3 వతేదీ ప్రారంభమై 18వ తేదీతో ముగుస్తాయని నేపథ్యంలో ముండ్లమూరు మండలంలో 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ జి చంద్రమోహన్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలైన ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 రూములలో 180 విద్యార్థిని విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 8 రూములలో190 విద్యార్థిని విద్యార్థులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 5రూములలో 100 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలో వ్రాయనున్నారు. మొత్తం 21 రూములలో 474 మంది బాలికలు, బాలురు పరీక్షలో వ్రాయనున్నారు. ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో62 మంది ఆదర్శ పాఠశాలలో 88 మంది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 32 మంది వేముల లో36 మంది ఈ ధరలో81 మంది, మారెళ్ళలో83 మంది, ఉమామహేశ్వర పురంలో71 మంది, పూరి మెట్లలో 21 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు.

వైసీపీకి చరమగీతం పాడండి

జిల్లా టీడీపీ అధ్యక్షుడు దామచర్ల జనార్ధన్

విశాలాంధ్ర-తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు గ్రామంలో మార్కాపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర కొనకనమిట్ల మండలం నుండి సాయంత్రం 6 గంటలకు చేరుకుంది. నారాయణరెడ్డి పాదయాత్ర చేపట్టి ఏడు రోజులు కావస్తుంది. కలు జువ్వలపాడు గ్రామ టిడిపి నాయకులు ప్రజలు కందులకు ఘన స్వాగతం పలికారు. జిల్లా టిడిపి అధ్యక్షులు దామచర్ల జనార్ధన్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ పశ్చిమ ప్రాంతానికి వెలుగొండ ప్రాజెక్టు జీవనాడి అన్నారు. మార్కాపురంన జిల్లా చేయాలని నారాయణరెడ్డి ముఖ్య ఉద్దేశమని అన్నారు. నారాయణరెడ్డి చేపట్టిన ఈ పాదయాత్రకు ప్రత్యేకత ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలని ప్రజా చైతన్యం కోసం కందుల అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుండి ఏ ఒక్క వర్గం ప్రజానీకం సంతోషంగా లేరని అన్ని విధాల ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైయస్సార్ పార్టీకి చరమగీతం పాడి తెలుగుదేశం ప్రభుత్వానికి పూర్వ వైభవం తేవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కందుల మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజలు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సుఖ సంతోషాలతో ఉండాలన్నదేనా అభిమతం అన్నారు. వెలుగొండ ప్రాజెక్టును త్వరగా తిన పూర్తి చేసి, ముంపు ప్రాంత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, మార్కాపురం జిల్లా చేయడమే నా ఆకాంక్ష అనిసభాముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, యూనిట్ క్లస్టర్ కుందూరు కాశిరెడ్డి, జిల్లా టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, నంబుల లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ మంద వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి పులివెందుల ఏసుదాసు, కలుజూల పాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు మేకలచ్చిరెడ్డి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మేకల నాగార్జున రెడ్డి, గ్రామ కమిటీ నాయకులు షేక్ ఖాసిం, ముల్లపాటి వెలుగొండయ్య, నాలి బాల వెంకటేశ్వర్లు, ముళ్లపాటి బాబు, కోనపులి మహేష్, కే నరసింహారావు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవం

విశాలాంధ్ర-కంభం : స్థానిక బాలికోన్నత పాఠశాల లో కంభం సెక్టార్ అంగన్వాడీ సెంటర్లు 63,64, 65, 66, 67, 68, సంయుక్తంగా అంగనవాడీలు, పోషణ పక్వాడా కార్యక్రమం సూపర్ వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అధితులుగా, కంభం మండలం కో ఆప్షన్ మెంబర్ సయ్యద్. సలీమ్, ఎంపీటిసి-2 ఎస్ఎండి రఫీ, పాలుగొన్నారు, సయ్యద్ సలీమ్ మాట్లాడుతూ చిరు ధాన్యాల గురించి వాటిలో వుండే పోషక విలువలు గురించి, కిషోర్ బాలికల బాల్య వివాహాలు జరిపించరాదని, బాల్య వివాహాలు జరిగితే వాటి నష్టాలను వివరించారు. కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్ పఠాన్ హబీబ్ ఖాన్, బాలికల పాఠశాల ప్రధానోఉపాధ్యాయురాలు బి.అమూల్య అంగన్వాడీ కార్యకర్తలు శారద, రమాదేవి, పద్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పశువులకు ఎద ఇంజక్షన్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఈ నెల ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి జూలై వరకు నాలుగు నెలల పాటు పశుసంవర్దక శాఖ, పశుగనాభివృద్ధి సంస్థవారి సంయుక్తంగా వారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో పశువు లైన ఆవులు, గేదలు, ఎద కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్‌లు ఉచితంగా వేయడం జరుగుతుందని ముండ్లమూరు పశు వైద్యాధికారిని ఎం విజయలక్ష్మి శనివారం తెలిపారు. పశు వైద్యశాలలో, గ్రామీణ పశు వైద్యశాలలో, గోపాల మిత్రులు రైతు భరోసా కేంద్రాలలో ఈ సదుపాయాన్ని ఆయా గ్రామాల్లోని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గేదెలకు గాలికుంటు టీకాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉల్లగల్లు గ్రామంలో శనివారం 250 గేదెలకు, దూడలకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కే కోటిలింగం తెలిపారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 24వ తేదీ వరకు అన్ని గ్రామా ల్లో వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ఆయన మాట్లాడుతూ ఆవులకు, గేదెలకు, దూడలకు, ఎద్దులకు టీకాలు వేస్తున్నామన్నారు. గ్రామాల్లోని పోషపోషకులు మూగ జీవాలకు టీకాలు వేయించుకోవాలని ఆయన తెలిపారు.

గర్భిణీలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గర్భిణీలు తమ ఆరోగ్యం పట్ల బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని వైద్యాధికారి సిహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల పూరిమెట్ల గ్రామంలో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లీన్‌కు వద్ద శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణీలు ఎండలో తిరిగినట్లయితే వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ చల్లని ప్రదేశాలలో ఉండాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కొబ్బరి నీళ్లు, మజ్జిగ, మంచినీళ్ల ఎక్కువగా తాగాలన్నారు. లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో దొరికే ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు తీసుకొని ఒక ప్యాకెట్ను ఒక లీటర్ నీటిలో కలుపుకొని తాగాలన్నారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో బాలింతలు 12 గర్భిణీలు 14 షుగర్ 38 బీపీ 35 జ్వరాలు జలుబు దగ్గులు45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగేశ్వరరావు, సిహెచ్ఓ లక్ష్మి, డీఈఓ వెంకటప్రసాద్, ఏఎన్ఎం బి రాబి ఆషాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని పొదిలి కమ్యూనిటీ ఆఫీసర్ పి.బ్రహ్మానందం తెలిపారు. మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పోలవరం, శంకరాపురం, గ్రామాలలో శనివారం ఆయన ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో బజార్లు వెంట తిరుగుతూ సైడ్ కాలువలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సైడ్ కాలువలలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు ఎటు పోక దుర్వాసన వస్తుందని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ ఫినాయిల్ పిచికారి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ కే యం యం సుభాని, సిహెచ్ఓ శరణ్య, ఏఎన్ఎం ప్రియదర్శిని, ఆషాలు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవండి

విద్యార్థులకు సబ్ కలెక్టర్ సెధు మాధవన్ పిలుపు

విశాలాంధ్ర-మార్కాపురం : రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో నిరంతరం ఇష్టంతో కష్టపడి చదువుతూ మంచి విద్యా ప్రమాణాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేదు మాధవన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏ1 గ్లోబల్ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం రాత్రి కళాశాలలో ఉత్సాహపూరితమైన వాతావరణంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం షంషీర్ అలీబేగ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, కావున ఈ నాలుగు సంవత్సరాల పాటు శ్రమపడి చదివితే తన లాగా కలెక్టర్ కావచ్చని, అలాగే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని విద్యార్థులకు సూచించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ అన్నా క్రిష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక విద్యకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ సెధు మాధవన్, కిట్స్ ఇంజ నీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ క్రిష్ణ చైతన్య ను కళాశాల చైర్మన్ డాక్టర్ యమ్.షంషీర్ అలీభేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీధర్‌లు శాలువతో ఘనంగా సన్మానిం చారు. ఈ సభలో అఖిల భారత యాదవ మహాసభ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు పీఎల్పీ యాదవ్ పాల్గొన్నారు.

ఆకుకూరలే ఆరోగ్యానికి రక్ష

విశాలాంధ్ర-మద్రిపూడి :

మహిళల ఆరోగ్యం బాగా ఉండాలంటే ప్రతి దినం ఆకుకూరలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుచరిత సూచనలిచ్చారు. మండలంలోని దుగ్గిరెడ్డిపాలెంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె శనివారం పాల్గొని బాలింతలకు గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టి కాహారాన్ని వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. బాలింతలు గర్భిణీలు, క్రమ తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. గ్రామాల్లో తక్కువ ఖర్చులతో లభించే బలవర్ధమైన ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

నరసింహా స్వామి దేవస్థానంలో బాలినేని పూజలు

విశాలాంధ్ర-సింగరాయకొండ : పాత సింగరాయ కొండలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి చెందిన శ్రీ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఎంతో మహిమ గల నారసింహ స్వామి దివ్య ఆశీస్సులు ఉంటే అన్ని శుభాలు చేకూరుతాయని అన్నారు. సింగరాయకొండ ప్రాంతానికి వివిధ పర్యటనలలో వచ్చినప్పటికీ స్వామి వారి దివ్య దర్శనం, విశేష పూజలు నిర్వహించు కునేందుకు అవకాశం లేక పోయింది. స్వామి వారి కృపతో శనివారం బాలినేని తన సతీమణి శచీదేవి కోడలు మనుమడి తో కలిసి వచ్చి నారసింహ స్వామి వారికి యోగానంద స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా బాలినేని వాసు పాత సింగరాయ కొండ శ్రీ వరాహాల లక్ష్మీనరసింహస్వామికి దర్శనానికి వస్తున్న విషయాన్ని తెలుసుకొని ఆర్చివద్ద మండల యువ నాయకుడు యన్నా బత్తిన కార్తీక్ యాదవ్ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి శాలువా కప్పి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ పామర్తి మాధవరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కృష్ణవేణి బాలినేని కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు నిర్వహించి యోగానంద నారసింహ క్షేత్రంలో స్వామి వారి దర్శనం చేసుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ ప్రాంగణంలోని స్వయం భు వీరాంజనేయ స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఆస్థాన మండపంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు అర్చక స్వాములు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, సింగరాయకొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటి పర్తి వనజ, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, శ్రీహరిరెడ్డి, శీలం రమణయ్య, సలీం భాష, సుల్తాన్, గాలి బుజ్జి, ఊళ్లపాలెం సర్పంచ్ కుమారుడు సుబ్బారెడ్డి ట్రస్ట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైసీపీలో కీలక నేతల రాజీనామాలు..!

- పీసీపల్లిలో ఏం జరుగుతోంది?
- వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ రాజీనామా వెనుక కారణాలు ఏంటి?
- ఇదే బాటలో మరో నాలుగైదు పంచాయతీలు..
- మండలంలో వైసీపీ ఖాళీ అంటున్న ప్రజానీకం
- తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టకుంటే ఇబ్బందులే

విశాలాంధ్ర-పీసీపల్లి : పెదచెర్లోపల్లి మండలంలో వైసీపీ పార్టీలో అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేయకుండా రాత్రింబగళ్లు పార్టీ కోసం కష్టపడి అహర్నిశలు కృషి చేసి గెలిపించిన నాయకులు సైతం కీలక నేతలు రాజీనామా చేసినా మిన్నుకుండు పోవడం గమనార్హం. మరికొందరు మండల నాయకులు అయితే పూర్తిగా సైలెంట్ అయిన పరిస్థితి. మండలంలో వైసిపి పార్టీ పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయినట్లేనని ప్రజలు ఘాటైన విమర్శలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పెద అలవలపాడు గ్రామానికి చెందిన ప్రస్తుతం మురుగమ్మి గుదేవారిపాలెం ఎంపీ టీసీలు వైస్ ఎంపీపీ చెరుకూరి ప్రసూన తనయుడు చెరుకూరి సతీష్ కుమార్ పదవులకు రాజీనామాలు చేసినట్లు సమాచారం.

అంతా తానై నడిపించి చివరికి రాజీనామాతో సరి

మండలంలో 2014 ఎన్నికలు మొదలుకొని 2019 ఎన్నికల వరకు అంతా తానై మండలంలోని నాలుగు ఐదు పంచాయతీలను తన బుధస్కందాలపై వేసుకుని రాత్రింబగళ్లు అహర్నిశలు కష్టపడి పార్టీ కోసం పనిచేసే సర్పంచులను ఎంపీటీసీలను గెలిపించి స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అత్యధిక మెజారిటీకి పార్టీ బలోపేతానికి తీవ్రంగా కృషి చేసిన కీలక నాయకుడు తన పదవికే కాకుండా తన తల్లి వైస్ ఎంపీపీ పదవికి కూడా రాజీనామా చేయ దంతో ప్రజానీకం మొత్తం ఉలిక్కి పడింది. దీంతో పిసిపల్లి మండలంలో సగం వైసీపీ పార్టీ ఖాళీ అయినట్లేనని మండల ప్రజలు విశ్లేషిస్తున్నారు.

కీలక నేతల రాజీనామాల వెనుక ఉన్న మర్మం?

2019 ఎన్నికలలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అత్యధిక మెజార్టీ గెలుపులో భాగంగా పీసీపల్లి మండలంలోని నాలుగైదు పంచాయతీలలో చక్రం తిప్పి అంతా తానే వ్యవహరించి ఎమ్మెల్యే బుర్రా గెలుపునకు ఎనలేని కృషి చేశారు. అనంతరం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో కీలక నేతగా ఎదిగారు. అనంతరం మండల యూత్ అధ్యక్షులుగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీకి కంచుకోటగా మారిన మురుగమ్మి ఎంపీటీసీ స్థానం నుంచి 58 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు అనంతరం తన తల్లికి వైస్ ఎంపీపీ పదవిని కానుకగా అందించారు. అనంతరం మండలంలో మారిన సమీకరణాల నేపథ్యంలో కొంతకాలంగా సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక ఎమ్మెల్యేకు పలు అత్యవసరమైన సమస్యలను విన్నవించినప్పటికీ ఫోన్ కాల్స్ కూడా స్పందించకపోవడంతో 2014లో పెద అలవలపాడులో జరిగిన గోగాడి సింగయ్య హత్య కేసులో న్యాయం చేయలేకపోవడం తదితర అంశాలతో మారిన సమీకరణాల నేపథ్యంలో కలతచింది రాజీనామా చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏది ఏమైనాప్పటికీ మండలంలో కీలక నేతల రాజీనామాతో మరో నలుగురు ఎంపీ టీసీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పార్టీ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే మండలంలో సగం వైసీపీ ఖాళీ అయ్యే ప్రమాదంలో ఉంది.

రాజీనామాల బాటలో మరికొందరు ఎంపీటీసీలు

మండలంలో కీలక నేతలు రాజీనామాలు చేయడం పార్టీ నుండి సహకారం ఉండకపోవడంతో మండలంలో మరి కొంతమంది ఎంపీటీసీలు రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ తీరుపై అసంతృప్తిగా ఉన్న మరికొందరు ఎంపీటీసీలు సైతం కీలక నేతలు రాజీనామా చేయడంతో అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ వైసీపీ అధిష్టానం పీసీపల్లి మండలంలో శరవేగంగా మారుతున్న పరిణామాలు దృష్టిలో పెట్టుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే వైసిపి పార్టీ మరింత దిగజారే పరిస్థితి ఏర్పడింది.

ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కలిసిన ఉగ్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఘనవిజయం సాధించిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను శనివారం కందుకూరు పట్టణంలోని జరుగుతున్న అభినందన సభలో కనిగిరి టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గాయం కృష్ణారెడ్డి, కూడలి రోశయ్య, గంగిరెడ్డి రమేష్ రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మనోజ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ఎంపీపీ కామూరి అమూల్య

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో గాలి బీభత్సం సృష్టించగా పలువురు రైతులకు పంట నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ కామూరి అమూల్య, గిద్దలూరు ఉద్యాన వన శాఖ అధికారిని శ్వేతలు మండలంలో పర్యటించారు. మండలంలోని ఎర్రపల్లి, గోనపల్లి, ఆల్లినగరం గ్రామాలలో పర్యటించారు. అరటి, బొప్పాయి, మామిడి తోటల్లో చెట్లు నేలకొరగగా సంబంధిత రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత రైతులతో మాట్లాడిన ఎంపీపీ అమూల్య సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

గంగవరం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు ప్రభుత్వ గుర్తింపు

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు లభించిందని వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ బి.రత్నం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రకాశం జిల్లాలో 8 ప్రభుత్వ వైద్యశాలను ప్రభుత్వ ప్రత్యేక గుర్తింపు ఇచ్చిందని దానిలో తూర్పు గంగవరం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు కూడా గుర్తింపు లభించిందని దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. వీటిలో 20 లక్షల రూపాయలతో వైద్యశాలలో అవసరమైన భవన నిర్మాణానికి, 20 లక్షల రూపాయలు ల్యాబ్ అభివృద్ధి పనులకు, 10 లక్షల రూపాయలతో ఇతర సదుపాయాలను ఏర్పాటు చేసుకునే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన వైద్యశాలగా తూర్పు గంగవరం ప్రభుత్వ వైద్యశాలకు గుర్తింపు లభించడానికి ప్రయత్నించిన దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావుకు, జడ్పిటిసి మారం వెంకటరెడ్డి, తాళ్లూరు మండల వైసిపి ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్ర, ఇతర ప్రజాప్రతినిధులు ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, గ్రామ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వారు అందించిన ప్రోత్సాహంతో మరిన్ని వైద్య సేవలు అందించి వైద్యశాలకు మంచి పేరు వచ్చే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

రూ.10 వేల నగదు చోరీ

విశాలాంధ్ర-మర్రిపూడి : మండలంలోని గ్రంథాలయం వీధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో పట్ట పగలే చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఉప్పు సుబ్బారావు, తన కుమారుడిని వైద్య నిమిత్తం ఒంగోలు వెళ్లారు. సుబ్బారావు భార్య సుశీల ఇంటికి తాళం వేసి బజారుకు వెళ్లగా, ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు, ఇంటి వెనుక తలుపులు పగలగొట్టి లోపలకు జొరబడి, పదివేలు నగదు, సవరన్నర బంగారం అపహరించి వెళ్లారు. ఇంటికి తిరిగి వచ్చిన సుశీల తెరిచి ఉన్న తలుపులు చూసి సొమ్ము పోయిన విషయాన్ని గుర్తించి, వెంటనే తన బంధువులకు పోలీసులకు సమాచారాన్ని అందజేసింది. ఎస్సై అంకమ్మరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి, పరిసరాలను పరిశీలన చేశారు. సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలను పరామర్శించిన పువ్వాడి

విశాలాంధ్ర-పామూరు : ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ సర్పంచ్ కాబిటి సుబ్బయ్య, అలాగే టిడిపి సీనియర్ నాయకులు బాలయ్య ఫాన్స్ అధ్యక్షులు నర్సింగ్ సాంబ శివరావులు మెరుగైన వైద్య చికిత్సలు పొంది వచ్చి తమ గృహాలలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం టిడిపి మండల అధ్యక్షులు వారి వెంకటేశ్వర్లు మండల నాయకులతో కలిసి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, మాజీ జెడ్పిటిసి మోరబోయిన హుస్సేన్ రావు యాదవ్, మాజీ ఎంపీటీసీ లు ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ కాజా రహమతుల్లా, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి, గుంటుపల్లి శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు (పెట్రోల్ బంక్), దేవరపు కుమార్యాద్రి, మెంటా నరసింహారావు, గుత్తి మహేష్ తదితరులు ఉన్నారు.

13న డీహెచ్‌పీఎస్ సెమినార్

కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 13న దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) జిల్లా సమితి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం, బహుజన రాజ్యాంగం, అవకాశాలు, అవరోధాలు, మన కర్తవ్యం అనే అంశంపై సెమినార్ స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పందిటి మోహన్ పేర్కొన్నారు. మల్లయ్యలింగం భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు చేతుల మీదుగా విడుదల చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ మాట్లాడుతూ శతాబ్దాలుగా అణచివేతకు, దోపిడీకి, పీడనకు గురైన వర్గాలన్నీ బహుజనులేనని, ఈ వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించబడ్డా, 75 సంవత్సరాల మోసకారీ పాలక వర్గాల కుట్రల కారణంగా అణగదొక్కబడుతూనే ఉన్నారన్నారు. మతం మారణ హోమం చేస్తుంటే, కులం పరువు హత్యలు చేస్తుందన్నారు. పనిచేయటానికి ఉద్యోగం అడిగితే పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఇటువంటి పరిస్థితులలో పాలక వర్గాల కుట్రలను తిప్పికొట్టటం ఎలా, బహుజనుల రాజ్యాధికారం హక్కు సాకారం కావాలంటే ఏం చేయాలి, అవరోధాలను ఎదుర్కోవటానికి ఎలాంటి వ్యూహాలు పన్నాలి, బానిస భూస్వామ్య పెట్టుబడీదారి సమాజాలకు పూర్తిగా భిన్నమైన నూతన సమాజాన్ని నిర్మించుకోవటం ఎలా అనే అంశాలపై సెమినార్‌లో చర్చించటం జరుగుతుందన్నారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా జిల్లా మాజీ కలెక్టర్ దాసరి శ్రీనివాసులు, ప్రధానోపన్యాసకులుగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ శ్రీపతి రాముడు, విశిష్ట అతిథులుగా ఆడిట్ డిపార్ట్‌మెంట్ జెడి వై వెంకటేశ్వర్లు, సేల్ టాక్స్ రిటైర్డ్ డిప్యూటీ కమీషనర్ ఆర్ సదానందరావు, డాక్టర్ ఎస్ విజయ రాఘవరావు, మెప్మా పీడి తేళ్లరవికుమార్, ఉపన్యాసకులుగా డిహెచ్‌పిఎస్‌ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట్రావు, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు ఎస్‌డి సర్ధార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రనికి ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. డిహెచ్‌పిఎస్ నాయకులు రామయ్య, కంకణాల సుందరరావు, పాముల జగన్మోహనరావు, ముత్తన అంజయ్య పాల్గొన్నారు.

జనసేనలోకి వీరమహిళలు

విశాలాంధ్ర-ఒంగోలు : జనసేన పార్టీ చీరాల నియోజకవర్గ వీర మహిళ కారంపూడి పద్మిని ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మహిళలు పార్టీలోకి రావడం చాలా ఆనందదాయకమని ఇలాగే చీరాల నియోజకవర్గంలో మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలని కోరుతూ పార్టీ బలోపేతానికి సూచనలు సలహాలు ఇచ్చారు. మహిళా నాయకురాలు కారంపూడి పద్మిని మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని వీర మహిళ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఒంగోలులోని పార్టీ ఆఫీసులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, ప్రకాశం ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్‌పై ప్రజల్లో బలమైన నమ్మకం

- మద్దిశెట్టి శ్రీధర్

విశాలాంధ్ర-దర్శి : స్థానిక శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ క్యాంపు కార్యాలయంలో మండల సచివాలయ, కన్వీనర్లు, గృహసారధుల సమావేశంలో జరిగింది. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరులు మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వారధిలా, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశం గర్వపడేవిధంగా ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులుపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అన్న నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. గృహ సారథులు వారికి అందచేసిన సామగ్రిలోని బ్యాడ్జీలు ధరించి, వారి వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రతినిధులుగా వెళ్లాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అని ముద్రించిన కరపత్రాలుతో గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏమి చేశారో, ఇప్పటి మన జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ఏమి మేలు చేస్తున్నామో ఉంటుందన్నారు.మన జగనన్న ప్రభుత్వంలో కుల, మత, వర్ణ, వర్గ రాజకీయాలకతీతంగా, మనల్ని విమర్శించి, మనల్ని ద్వేషించే వారికి కూడా సంక్షేమ పథకాలును అమలు చేస్తున్నామన్న విషయాలను ప్రతి కుటుంబానికి తెలియజేసి ప్రభుత్వానికి మద్దతు కూడ గట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ జేసిబి మండల ఇంఛార్జి బాత్తినేని వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో ప్రజలకు ఒరిగింది శూన్యం

- గృహ సారథులు, మండల కన్వీనర్లే పార్టీకి పునాదులు
- రాష్ట్ర మంత్రి సురేష్

విశాలాంధ్ర-పెద్దారవీడు : టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదని మళ్లీ అధికారంలోకి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని దేవరాజు గట్టు పోలీస్ స్టేషన్ ఆవరణంలో గృహ సారథులు సచివాలయం మండల కన్వీనర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైయస్ ఆర్సీపీ మండల కన్వీనర్ పార్టీ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి పాల్గొని మాట్లాడుతూ జగనన్నే మా నమ్మకం అనే కార్యక్రమంలో భాగంగా గృహసారథులు కన్వీనర్లు చేయవలసిన ఐదు అంశాలపై ముందుగా మాట్లాడారు. దీంతోపాటుగా గృహసారథులు సచివాలయ కన్వీనర్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పునాది లాంటి వాళ్ళని వారు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందినాయ లేదా అని గృహసారథులు కన్వీనర్లు ఇంటింటికి తిరగాలని ఆయన సూచించారు దీంతోపాటుగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చినటువంటి స్టిక్కర్ను ప్రతి గృహానికి అంటించాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రజలను అరాచక పాలన కొనసాగిస్తారని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వ దాయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆయన సూచించారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా ప్రతి లబ్ధిదారి అకౌంట్‌కు నేరుగా డబ్బులు పడేవిధంగా చేశాడంటే అది ఏకైక వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ అని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో దమ్ముంటే ఒక్కడిగా వచ్చి పోటీ చేయాలని టిడిపికి సవాల్ విసిరారు. 40 ఏళ్ల చరిత్ర ఉన్న టిడిపి పార్టీని బోల్తా కొట్టించి 12 ఏళ్ల చరిత్ర గల పార్టీ అధికారంలోకి వచ్చిందంటే కేవలం అది జగనన్న కే సాధ్యమవుతుంది అన్నారు. కార్యకర్తలు నాయకులు నిరాశ పడకుండా పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి దృష్టిలో మీ ఆలోచన విధానాలన్నీ ఆయన దగ్గర ఉన్నాయని ఆయన త్వరలోనే అందరికీ న్యాయం చేస్తారని ఆయన సూచించారు. నష్టపోయిన కార్యకర్తలకు నాయకులకు పార్టీ నుంచి అన్ని సహాయ సహకారాలు జగనన్న అందిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జార్జి విద్యాసంస్థ చైర్మన్ విశాల్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంచగొర్ల పిచ్చయ్య యాదవ్, జడ్పిటిసి ఏరువ చలమారెడ్డి ఎంపీపీ బెజవాడ పెద్ద గురువయ్య, వైస్ ఎంపీపీ గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ ఏరువా వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు అంగిరేకుల ఆదినారాయణ యాదవ్, బలుసుపాటి నాగరాజు, కుర్రా కీరా నాయక్, బెజవాడ ఆదాము, సుబ్బయ్య గౌడ్, పొందుగుల వెంకటరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పొద్దుల లక్ష్మిరెడ్డి, పెద్దారవీడు సోషల్ మీడియా కన్వీనర్ సొంటి నాగార్జునరెడ్డి, అల్లు వెంకటే శ్వరరెడ్డి (డీలర్)కాసు వెంకట్ రెడ్డి. మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలి

విశాలాంధ్ర-పామూరు : వైసిపి నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్రం అధోగతిపాలైందని, రానున్న శాసనసభ ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు కార్యకర్తలు నాయకులు ఇంటింటా తిరిగి ప్రజలను చైతన్య పరచాలని టిడిపి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్యదర్శి పడుచుమల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. శనివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటువంటి జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన కృషి ఫలించిందని అదే జోష్‌తో కనిగిరిలో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గెలుపు కోసం కృషి చేద్దామన్నారు. అనంతరం కార్యకర్త మెంటా నరసింహారావు జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హుస్సేన్ రావు యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి, తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, ఉప్పలపాటి హరిబాబు, గుంటుపల్లి శ్రీనివాసులు, దేవరపు మాల్యాద్రి, ఇర్రి కోటిరెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న హనుమంతునిపాడు మండల పరిధిలోని హాజీపురం అడ్డరోడ్డు వద్ద 2015 సంవత్సరంలో రంగమ్మ అనే మహిళ మెడలో తాళిబొట్టు గొలుసును దొంగలించడం జరిగింది. అనంతరం వివరాల్లోకి వెళ్ళగా పామూరు మండలం పరిధిలోని నల్ల మారెళ్ళ గ్రామానికి చెందిన శ్రీరామ శ్రీను, నరేష్ అనే దొంగలిద్దరుకు 500 రూపాయల జరిమానాతో పాటు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి భరత్ చంద్ర ముద్దాయిలకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని హనుమంతునిపాడు మండల ఎస్సై జి కృష్ణపావని తెలిపారు.

శ్రీశైలం ఘాట్ రోడ్‌లో శిఖరం వద్ద రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : శ్రీశైలం ఘాట్ రోడ్‌లో బొలెరో వాహనము స్కూటీ ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీశైలం ఘాట్ రోడ్‌లో శనివారం జరిగింది. అందిన సమాచారం మెరకు బొలెరో వాహనం శ్రీశైలం వెళ్తుండగా, అదే సమయంలో శ్రీశైలం నుండి వస్తున్న స్కూటర్ ఎదురెదురుగా ఢీకొనడంతో స్కూటర్‌పై ప్రయాణి స్తున్న ఆలయ పూజారి చిలిమీకోటి శివనాగ ప్రసాద్ (45) అక్కడి కక్కడే మృతి చెందాడు. బొలెరో వాహనంలో ఉన్న మాచర్లకు చెందిన కొరటా వెంకటేష్ (35) సంవత్సరాలు మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే దోర్నాల ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రవర్ణాల నుండి దళితులను కాపాడాలి

- సబ్ కలెక్టర్‌ను కలిసిన చింతకుంట్ల ఎస్సీ వాసులు

విశాలాంధ్ర-మార్కాపురం : మండలంలోని చింతకుంట్ల గ్రామానికి చెందిన సుమారు వందమంది ఎస్సీ కాలనీ వాసులు శనివారం సబ్ కలెక్టర్ సేదు మాధవన్ కలిశారు. ఎన్నో సంవత్సరాలుగా చింతకుంట్ల కొండపై ప్రార్థనలు చేసు కుంటున్నామని, అన్యమతస్తులు అడ్డుకుంటున్నారని ఆరోపిం చారు. అలాంటి వారిపై చర్యలు తీసుకొని ప్రార్థనలు చేసుకున్నందుకు పర్మిషన్ ఇవ్వాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. అగ్ర వర్ణాల ప్రజలు బెదిరిస్తూ నోటి కొచ్చినట్టు దూషిస్తూ, దాడులకు పాల్పడుతు భయభ్రాంతులకు గురిచేస్తున్న వారి నుండి మాకు రక్షణ కల్పించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చింతకుంట్ల ఎస్సీ కాలనీ ప్రజలు సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌ను కోరారు.

పెండింగ్ రోడ్డుకు మహర్దశ

విశాలాంధ్ర-ఒంగోలు : 20 సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న రోడ్డుకు బాలినేని కృషితో మహర్దశ పట్టింది. రూ.26.75 లక్షలతో మినీ బైపాస్ గోపాల్ నగరం 4 లైన్ నుంచి నుంచి కమ్మపాలెం 3 లైన్ వరకు రోడ్డు పనులకు రీజనల్ కోఆర్డినేటర్ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన బాలినేనికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డివిజన్ ఇంచార్జి బాచి,నూర్ బాషా డైరెక్టర్ షేక్ సోఫియా దంపతులు బాలినేనికి బొక్కే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రూ.27 లక్షల ఏర్పాటు రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని బాలినేని ఆవిష్కరించారు. బాలినేని మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నగరంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి చేయటం జరుగుతుందని, అందులో భాగంగా 20 సంవత్సరాల నుంచి పరిష్కారం కానీ రోడ్డును పరిష్కరించి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. రోడ్డు లేని చోట రోడ్డు వేస్తాము తప్పా రోడ్డు మీద రోడ్డు వేయమని అన్నారు. 5 కోట్లతో నగరంలోని అన్ని పార్కులు అభివృద్ధి చేశామని ఇంకా కొని చోట్ల పనులు జరుగుతున్నాయని అన్నారు. నగరంలోని శివారు కాలనీల అభివృద్ధి మా లక్ష్యమని అని బాలినేని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, 7వ డివిజన్ ఇంచార్జి షేక్ బాచి, నూర్ బాషా డైరెక్టర్ షేక్ సోఫియా, కార్పొరేటర్లు తిరుమల, ఎండేటి పద్మావతి, రంగారావు,ప్రవీణ్, గోపి, కో ఆప్షన్ నెంబర్ వర్దు శేషయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ అయినబత్తిన ఘనశ్యాం,డివిజన్ అధ్యక్షులు జఫరుల్లా, చెంచురామయ్య, డివిజన్ కార్యదర్శి వెంకట్రావు చౌదరి, వైసీపీ నాయకులు తాళ్లపాలెం శ్రీనివాసరావు, సైదా, అవుల సురేంద్ర పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రమోషన్లలో అవకతవకలు జరగలేదు

- అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- లాభాల బాటలో పీడీసీసీ బ్యాంక్
- బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : పీడీసీసీ బ్యాంకు ఉద్యోగుల ప్రమోషన్ల విషయంలో ఎటువంటి అవకతవకలు జరగలేదని బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక పిడిసిసి బ్యాంకు ఆవరణంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ తాను బ్యాంకు చైర్మన్ గా పదవి చేపట్టే సమాయానికి రాష్ట్రంలో బ్యాంకు అట్టడుగున 13వ స్థానంలో ఉన్నదన్నారు. రూ.3 కోట్ల నష్టాలతో నడుస్తుందన్నారు.అటువంటి బ్యాంకు పాలక మండలి, ఉద్యోగుల సమిష్టి కృషితో లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఇటువంటి సమయంలో బ్యాంకుపై బురద చల్లేందుకు ప్రయత్నించటం దుర్మార్గమన్నారు. 250 మంది ఉద్యోగులు, 2 లక్షల మంది రైతులు నమ్ముకున్న బ్యాంకు అన్నారు. బ్యాంకులో గతంలో ఆర్థికపరమైన అవకతవకలు జరిగాయని, వాటిని ఇప్పుడిప్పుడే సరిదిద్దుతున్నామన్నారు. బ్యాంకులో గతంలో కేవలం రూ.1800 కోట్లు వ్యాపారం జరిగేదని, కాని నేడు అది రూ.2,300 కోట్లకు చేరిందన్నారు. మొండి బకాయిలు రికవరీలో ఉద్యోగుల సమష్టి కృషి ఉందన్నారు. ఎంతో కష్టం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు గత 10 సంవత్సరాలుగా ఎటువంటి ప్రమోషన్లు లేవన్నారు. రైతులకు బ్యాంకుపై ఉన్న నమ్మకాన్ని వమ్ముకాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని బ్యాంకును అభివృద్ధి పదంలో నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసీపీవి అబద్ధాలు, అసత్యాలు

విశాలాంధ్ర-ఒంగోలు : వైసీపీ ప్రభుత్వానివన్నీ అబద్ధాలు, అర్థ సత్యాలని టిడిపి నేతలు ధ్వజమెత్తారు. ఒంగోలులోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ మోసపూరిత బడ్జెట్‌లో అబద్ధాలు, అసత్యాలతో ఇచ్చిన హామీలతో తీవ్రంగా నష్టపోతున్న నిరుద్యోగ యువత అనే అంశంపై పాత్రికేయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా మాట్లాడిన తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరొకటి అని ఈ ప్రభుత్వ హయాంలో భారీ ప్రాజెక్టుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2018-19లో గ్రోత్ రేట్ 32.1% ఉన్న ఈ సంఖ్య 2021-22 నాటికి మైనస్ 10.4%కి పడిపోయింది అని.. అదేవిధంగా ఒకప్పుడు విదేశీ పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే 14వ స్థానానికి దిగజారిందని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు నల్లూరి కిషోర్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పన చేయలేని ఈ అసమర్థ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు వాలంటరీల పేరుతో శ్రమదోపిడి చేస్తుందని దిక్కుతోచని స్థితిలో గ్రాడ్యుయేట్లు నిన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ కి తగిన బుద్ధి చెప్పారని అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మొగల్ కాలేషాబేగ్ మాట్లాడుతూ ఈ వైసీపీ అసమర్థ ప్రభుత్వ విధానాల మూలంగా రాష్ట్ర ప్రగతి 25 సంవత్సరాల వెనక్కి వెళ్లిందని 20 లక్షల మంది నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు.

గురువులకు పరీక్షే...!

- విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లలోను టెన్షన్
- ఏమరపాటుగా ఉంటే టీచర్లకు శిక్ష తప్పదు
- గతేడాది పరీక్షల్లో తప్పులు చేసిన గురువులకు ఈసారి బాధ్యతల నుంచి తొలగింపు
- తహసీల్దార్ కార్యాలయాల్లో కూర్చోవాలంటూ ఆదేశాలు
- ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయ సంఘాల నిరసన

విశాలాంధ్ర-కనిగిరి : పదో తరగతి పరీక్షలు ఈసారి విద్యార్థులకే కాకుండా పరీక్షలు పర్యవేక్షించే గురువులకు టెన్షన్‌గా మారాయి. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు, అక్రమాలు జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్‌లను విధుల నుంచి తప్పించి తహసిల్దార్ కార్యాలయాల్లో కూర్చోవలసి వస్తుందంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరీక్షలు పర్యవేక్షించాల్సిన గురువులు సరికొత్త పరీక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది. గత ఏడాది పరీక్షల్లో ఆరోపణలు వచ్చిన ఉపాధ్యాయులను పోలీస్ స్టేషన్లలో కూర్చోవాలంటే ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అన్ని వర్గాల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా పోలీస్ స్టేషన్ బదులు తహసిల్దార్ కార్యాలయాల్లో కూర్చోవాలంటూ ఉత్తర్వులు మార్చారు. మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం మగింత కఠినంగా ఉన్నప్పటికీ ఇప్పుడు అదే అంశం 10 పరీక్షల బాధ్యతలు నిర్వహించే గురువులకు టెన్షన్ రేపుతుంది. వాస్తవానికి ఏ ఉపాధ్యాయుడు కూడా విద్యార్థులను మాస్కాపింగు ప్రోత్సహించారు. కానీ పరీక్షా కేంద్రంలో కొందరు విద్యార్థులు చేసే తప్పులను తాము ఎక్కడ బాధ్యత వహించాల్సి వస్తుందో అన్న భయం ఇప్పుడు ఇన్విజిలేటర్లను వెంటాడుతుంది. అదేవిధంగా పరీక్ష ప్రశ్నా పత్రాలపై ఈసారి ఏడు అంకెల కోడ్ ఉంది. దీంతో ప్రశ్నాపత్రం ఎక్కడ లీక్ అయిందో సులభంగా తెలిసిపోయే అవకాశం ఉన్నందున ఈసారి ఉపాధ్యాయులు పరీక్ష గదిలోకి ఇతరులు అడుగు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రకాశం జిల్లాలో ఈనెల మూడో తేదీ నుంచి 18వ తేదీ దాకా జరిగే పదవ తరగతి పరీక్షలకు 28,905 మంది విద్యార్థులు 175 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు.

ఇన్విజిలేటర్ల బాధ్యతలు ఇవే

పరీక్షల విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల ఉదయం 8:30కే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు ప్రవేశించే ముందు వారిని క్షుణంగా తనిఖీ చేసి వారి వద్ద ఎలాంటి నిషేధిత వస్తువులు స్లిప్పులు పుస్తకాలు లేవని నిర్ధారణ చేసుకోవాలి. పరీక్షకు ముందు ఇన్సులేటర్లకు లాటరీ ద్వారా నిర్వహించిన గదుల్లోకి ఉదయం తొమ్మిది గంటలకల్లా వెళ్లాలి. ఇన్విజి లెటర్లు తమ వద్ద తప్పనిసరిగా గుర్తింపు కార్డు ఉంచుకోవాలి. విద్యార్థుల హాల్ టికెట్ ను పరిశీలించి ఫోటోలో ఉన్న విద్యార్థి పరీక్ష రాస్తున్న విద్యార్థి ఒకరే అన్నది నిర్ధారించుకోవాలి. ఒకవేళ అనుమానం వస్తే ఆ విద్యార్థి వివరాలను చీఫ్ సూపర్నెంట్ దృష్టికి తీసుకుని వెళ్లాలి. విద్యార్థుల ఓ యం ఆర్ షీట్లను పరిశీలించి మెయిన్ ఆన్సర్ షీట్ కు సీరియల్ నెంబర్ ఉన్నది లేనిది సరి చూసుకోవాలి. విద్యార్థులు ఓ ఎమ్ ఆర్ షీట్ పై సంతకం చేసిన తర్వాత ఇన్విజిలేటర్లు సంతకం చేయాల్సి ఉంటుంది. ఉదయం 9:25 గంటలకు స్టిక్కర్స్ వేయటం పూర్తి చేయాలి. పరీక్ష రాసిన విద్యార్థి ఆన్సర్ షీట్ చివరిలో ది ఎండ్ ని రాసి సంతకం చేయాలి. ఇన్విజిలేటర్ బయటకు వెళ్లాల్సి వస్తే రిలీవర్ను ఉంచి వెళ్ళాలి. పరీక్ష నిర్వహణలో బయటనుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడి వచ్చిన ఆ విషయం చీఫ్ సూపర్డెంట్ కు తెలియజేయాలి.

మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

మాస్ కాపీ జరగకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహించడంపై ఉపాధ్యాయ సంఘాలపై ఎలాంటి అభ్యంతరం లేదని, పరీక్షలు నిర్వహించే విషయంలో కఠినంగా ఉండాలటంలో తప్పేమీ లేదని ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయ పడుతున్నాయి. కానీ విద్యార్థులు చేసే తప్పిదాలను ఇన్విజిలేటర్లను బాధ్యులను చేయాలనుకోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల వాదన. చిన్నపాటి తప్పులు చేసిన ఉపాధ్యాయులను తహసిల్దార్ కార్యాలయాల్లో కూర్చోబెట్టడం సమంజసం కాదని ఉపాధ్యాయుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.